క్లుప్తంగా

సేవాలాల్ దేవాలయ నిర్మాణానికి భూమిపూజ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న గిరిజనులు

షాద్‌నగర్: మండల పరిధిలోని వెంకన్నగూడ తండాలో సేవాలాల్ మహారాజ్ దేవాలయ నిర్మాణానికి నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేత సక్కునాయక్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సలావత్ మానియా నాయక్, బావోజీ, టోపియా తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



భూమిపూజ చేస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌రెడ్డి

షాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని హైతాబాద్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు పొన్న వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాన్‌సింధార్‌ఖాన్‌పేట్ గ్రామంలో మైసమ్మ దేవాలయ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో లింగారెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, మచ్చేందర్, మహేందర్, శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



కేక్ కట్ చేస్తున్న నాయకులు

షాద్‌నగర్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీ టీచర్ మంజుల ఆధ్వర్యంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, బాలింతలు పోష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. తద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అదేవిధంగా శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బీష్వ మాధవి, పంచాయతీ సెక్రటరీ అర్జున్, నాయకులు సురేశ్‌గౌడ్, రమేశ్, గణేశ్‌యాదవ్, కృష్ణ, మంగలి మల్లేశ్, శంకరయ్యయాదవ్, ఏఎన్‌ఎం నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలు నిర్మించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో గల పద్మావతి-2 కాలనీలో వీధిదీపాలు, అండర్ డ్రైనేజీ మురుగు కాలువలు నిర్మించాలని ఆ కాలనీవాసులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. కాలనీలో వీధిదీపాలు లేవని, మురుగు కాలువలు నిర్మించాలని కాలనీ అధ్యక్షుడు జనార్ధన్‌రావుయాదవ్ కమిషనర్‌కు తెలియజేశారు. దీంతో కమిషనర్ ప్రజా సమస్యలు తీర్చేందుకు తమవంతు కృషి ప్రభుత్వం ద్వారా చేస్తామని తెలిపినట్లు వివరించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జనార్ధన్‌రావు, చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు పార్కింగ్‌తో అవస్థలు

- రహదారులపై ఇష్టారాజ్యంగా వాహనాల నిలిపివేత
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు



ఓ పరిశ్రమ ఎదుట రోడ్డుపై నిలిపిన వాహనాలు

నందిగామ: అసలే పారిశ్రామిక ప్రాంతం.. భారీ వాహనాలు, ట్రక్కులు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటాయి. కానీ ఆ వాహనాల డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలను ఎక్కడ పడితే అక్కడే రోడ్లపై నిలుపుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టించుకోవాల్సిన పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఆ వాహనాల డ్రైవర్లు తాము ఎక్కడ వాహనాలు నిలిపితే అదే పార్కింగ్ అనే రీతిలో వ్యవహరిస్తున్నారు.

జాతీయ రహదారిపై..

షాద్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే పాత జాతీయ రహదారిపై నందిగామ శివారులో సిలిండర్ పరిశ్రమ సమీపంలో రహదారి పక్కనే ఉన్న ఓ ఐరన్ పరిశ్రమకు పెద్దఎత్తున భారీ వాహనాలు, ట్రక్కులు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఆ పరిశ్రమకు వచ్చే భారీ వాహనాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో నిత్యం తెల్లవారుజాము నుంచే పాత జాతీయ రహదారిపై పదుల సంఖ్యలో అడ్డగోలుగా నిలుపుతుంటారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే ఎన్నో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఎంతో మంది ప్రాణాలు కోల్పోగా, మరెంతో మంది గాయపడినవారు ఉన్నారు. నిత్యం పోలీసులు ఇదే రోడ్డుపై వెళ్తుంటారు. కానీ వాహనాలను మాత్రం పట్టించుకోరనే ఆరోపణలు ఉన్నాయి. నందిగామ నుంచి అంతిరెడ్డిగూడకు వెళ్లే రహదారిలో మరో ఐరన్ పరిశ్రమ ఉంది. ఆ పరిశ్రమకు సైతం భారీ వాహనాలు, ట్రక్కులు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఈ పరిశ్రమ నుంచి ఉత్పత్తులను భారీ వాహనాలు, ట్రక్కులలో తరలిస్తుంటారు.

తహసీల్దార్ కార్యాలయమా.. ఐతే మాకేంటి..

నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాదకరంగా ఐరన్ రాడ్‌లను ట్రక్కులలో వేసుకొని, ఆ ఐరన్ రాడ్‌లు ఆ ట్రక్కు నుంచి కనీసం 10 నుంచి 15 ఫీట్ల వరకు బయటకు వేలాడి ఉంటాయి. ఆలాంటి వాహనాలను మండల కేంద్రమైన నందిగామలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట ఉన్న వే బ్రిడ్జిపై యథేచ్ఛగా వేయింగ్ వేయించి రోడ్డు పక్కనే గంటల కొద్ది నిలుపుతుంటారు. ఇక్కడ కనీసం తహసీల్దారు కార్యాలయం ఉందని, ఇక్కడికి పలు పనుల నిమిత్తం అనేక మంది వస్తుంటారని, వారికి ఇబ్బందులు కలుగుతాయని, ఆ పరిశ్రమ నిర్వాహకులు గానీ, వాహనాల డ్రైవర్లు గానీ ఏ మాత్రం పట్టించుకోరు. కనీసం ట్రాఫిక్ పోలీసులు గానీ, సివిల్ పోలీసులు గానీ తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సింగిల్ రోడ్డుగా..

వీర్లపల్లి నుంచి చేగూరుకు వెళ్లే రహదారిలో సైతం ఐదు అతిపెద్ద ఐరన్ పరిశ్రమలు ఉన్నాయి. ఆ పరిశ్రమలకు వెళ్లే వాహనాలు సైతం రోడ్డుపైనే నిలుపుతుంటారు. ఆ రోడ్డుమీదుగానే సింబాయసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయానికి వెళ్లే విద్యార్థులు, పలు గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఆ రోడ్డుపై వాహనాలను నిలిపితే అడిగే వారే ఉండరని, దీంతో ఆయా పరిశ్రమల నిర్వాహకులు సగం రోడ్డు వరకు వాహనాలను నిలుపుతుండటంతో ఆ రోడ్డు వన్‌వేగా దర్శనమిస్తోంది.

పోలీసులు ఉన్నా.. ఫలితం సున్నా..

అటు ట్రాఫిక్ పోలీసులు, ఇటు సివిల్ పోలీసులు రెండు డిపార్ట్‌మెంట్లకు చెందిన పోలీసులు ఉన్నా కూడా అక్రమ పార్కింగ్‌ల విషయంలో ఏ మాత్రం ఫలితం కనపడటం లేదు. వాహనదారుల తీరులో ఏ మాత్రం మార్పు కనపడటం లేదు. వారు తమ ఇష్టానుసారంగా ఎవరైతే మాకేంటి అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. దీంతో రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఎందుకు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాంటి వాహనాలపై ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకున్నట్లయితే ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడమే కాకుండా, రోడ్డు ప్రమాదాలు సైతం నివారించిన వారవుతారు. కానీ వారు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో వాహనదారులు పోలీసుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పోలీసులు స్పందించి రోడ్లపై అక్రమంగా వాహనాలను నిలుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా ప్రమాదకరంగా ఐరన్ రాడ్లు ట్రక్కు వెలుపలికి వెసుకొని వెళ్లే వాహనాల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలి



పాత జాతీయ రహదారిపై భారీ వాహనాలు అడ్డగోలుగా నిలుపుతున్నారు. దీంతో ఆ రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుకు సగ భాగం వరకు ట్రక్కులు నిలుపుతుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అంతేకాకుండా పరిశ్రమల యజమానులు సైతం వారి పరిశ్రమకు వచ్చే వాహనాలకు పార్కింగ్ స్థలం చూయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–కేశమోని శ్రీనుయాదవ్, నందిగామ

రోడ్లపై నిలిపితే చర్యలు



రోడ్డుపై అడ్డగోలుగా వాహనాలు నిలపడం చట్ట ప్రకారం నేరం. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ఇతరులకు ఇబ్బందులు కలిగే విధంగా వాహనాలను నిలుపొద్దు. ఒక వేళ నిలపాలి అంటే రోడ్డు కిందకు ఖాళీ ప్రదేశంలో నిలపాలి. పరిశ్రమల యజమానులు సైతం వారి పరిశ్రమలకు వచ్చే వాహనాలకు పార్కింగ్ స్థలం చూయించాలి.

–ప్రసాద్, ఇన్‌స్పెక్టర్, నందిగామ

మహాసభలను విజయవంతం చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: ఈ నెల 21, 22న జిల్లాలోని శంషాబాద్‌లో జరిగే తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(బీటీసీ) ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభలను పెద్దఎత్తున విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం బీటీసీ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఏఐటీయూసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దేశంలో నిర్మాణ రంగం చాలా కీలకమైనదని, ఈ రంగంలో దాదాపు 10కోట్లకుపైగా కార్మికులు పనిచేస్తున్నారన్నారు. సమగ్రమైన సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని ఏఐటీయూసీ నాయకత్వంలో చేసిన పోరాటాల ఫలితంగా 1996లో ఆనాటి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తుచేశారు. 2014లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్పులు చేస్తూ కార్మికులకు అన్యాయం చేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 21, 22న జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మండల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

విధిగా పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీఓ శభానా

సీడీపీఓ షభానా

కొందుర్గు: గర్భిణులు, బాలింతలు ప్రతీ రోజు విధిగా పోషకాహారం తీసుకోవాలని సీడీపీఓ షభానా సూచించారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ప్రతీ రోజు భోజనంలో ఆకుకూరలు, కూరగాయలతో పాటు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే పోషకాహారం తీసుకోవాలన్నారు. అదేవిధంగా చిరుధాన్యాలు, పాలు, ఉడికించిన గుడ్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీఅనురాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న, ఏపీఎం జయమాలిని, పంచాయతీ కార్యదర్శి సురేఖ, ఏఎన్‌ఎం సుజాన్, అంగన్‌వాడీ, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో..

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని చింతకుంటతండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీత హాజరై పోషకాహారం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వసంత, సోనా, పుష్ప పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై ఆక్రమణల తొలగింపు



రోడ్డుపై నిర్వహిస్తున్న దుకాణాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు


చేవెళ్ల: మున్సిపాలిటీలోని ప్రధాన రోడ్డుకిరువైపులా రోడ్డును ఆక్రమించిన బోర్డులు, చిరువ్యాపారుల దుకాణాలను తొలగించారు. మంగళవారం మున్సిపాలిటీ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరూ సహకరించి రోడ్లను ఆక్రమించకుండా దుకాణాలను నడిపించుకోవాలని ట్రాఫిక్ సీఐ వెంకటేశం, మున్సిపాలిటీ మేనేజర్ రాఘవేందర్ తెలిపారు. లేనిపక్షంలో తామే అధికారికంగా తొలగించాల్సి ఉంటుందని చెప్పారు. పట్టణ కేంద్రంలో నుంచి వెళ్లే ప్రధాన రోడ్డుకిరువైపులా 100 మీటర్లు ఉండాల్సిన రోడ్డును కాస్తా 20 మీటర్లకే పరిమితం చేశారని, దీంతో పట్టణ కేంద్రంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అధికారులు తెలిపారు. మున్సిపాలిటీ పరిధి రూల్స్ ప్రకారం వంద ఫీట్ల రోడ్డు ఉండాల్సిందేనని, అక్రమంగా ఆక్రమించుకున్న వాటిని తొలగించుకోవాల్సిందేనన్నారు. రోడ్డుకిరువైపులా దుకాణాల ఎదుట ప్రత్యేకంగా బోర్డులు పెట్టడం, షెడ్‌లు వేసుకోవటమే కాకుండా చిరువ్యాపారుల బండ్లను సైతం ఏర్పాటు చేసి నడిపిస్తున్నారన్నారు. వీటితో రోడ్డు ఇరుకుగా మారటంతో పాటు ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. రోడ్లు వెడల్పుగా ఉండాలని, అక్రమంగా వెలిసిన వాటిని మీరే తొలగించుకోవాలని, లేనిపక్షంలో మున్సిపాలిటీ సిబ్బందితో వాటిని తొలగిస్తున్నట్లు తెలిపారు. దీనిపై కొందరూ అధికారుల తీరుపై పండిపడుతుంటే మరికొందరు అధికారులు చేస్తున్న పనులు సరైనవేనని అభినందిస్తున్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కేశంపేట: మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం దేవాలయ ప్రాంగణంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. అదేవిధంగా మాజీ ఎంపీపీ ఎల్లగనమోని రవీందర్‌యాదవ్ ఆధ్వర్యంలో రథోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభం



ముట్పూర్‌లో చలివేంద్రం ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ గ్రామంలో మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరి విష్ణువర్ధన్‌రెడ్డి చేతులమీదుగా చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముట్పూర్ గ్రామానికి చెందిన కనకమామిడి కార్తీక్ తన తల్లిదండ్రులైన మల్లమ్మ, కిష్టయ్య దంపతుల జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింలు, కృష్ణారెడ్డి, రవి, భీమయ్య, సుధాకర్‌రెడ్డి, తరుణ్, చందురెడ్డి, అంజయ్య, మల్లయ్య, శ్రీను, గోపి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంతాపూర్‌లో..

కేశంపేట: మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలో బీజేపీ యువ నాయకుడు కర్రేడ్ల నరేందర్‌రెడ్డి చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని మంగళవారం నరేందర్‌రెడ్డి గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో అమ్రేశ్, అంజయ్య, వెంకటేశ్, వేణుగోపాల్‌రెడ్డి, రాజు, భద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్కలు నాటుతున్న సిబ్బంది

షాద్‌నగర్: వన ప్రేమికుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత దరిపల్లి రామయ్యను స్మరిస్తూ మంగళవారం మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో ఉన్న బృహస్పతి టెక్నాలజీస్ లిమిటెడ్ పరిశ్రమలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటామన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దరిపల్లి రామయ్య సేవలు తమలో ఎంతో స్ఫూర్తిని నింపాయని కొనియాడారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

కందుకూరు: ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ టి.దేవేందర్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు ఇందిర కోరారు. మండల పరిధిలోని దాసర్లపల్లితండాకు చెందిన నేనావతి కేస్లీకి రూ.58వేలు, రమావత్ రవికి రూ.15వేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరయ్యాయి. ఆ లబ్ధిదారులకు ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం వారు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు

చేవెళ్ల: మండలంలోని కమ్మెట గ్రామంలో మంగళవారం రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో గ్రామస్తులందరూ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తులు పూనకాలు ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాల్లో గ్రామపెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై విసుగు చెందిన ప్రజలు

సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి



రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు విసుగు చెందారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కేసీఆర్ నాయకత్వాన్ని గెలిపించేందుకు ముందుకొస్తారని సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రాఘవరెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జీవన్‌గూడ రాములు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జీవన్‌గూడ చౌరస్తాలో రాము ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ ఉత్సవ సభ వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వారు పాల్గొని మాట్లాడుతూ.. కేసీఆర్ నిర్దేశించిన సూచన మేరకు నాయకులు, కార్యకర్తలందరం కలిసి పని చేద్దామన్నారు. వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు అందరూ తరలిరావాలని సూచించారు. స్థానిక, మున్సిపల్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలందరూ కలిసి పనిచేసినప్పుడే బీఆర్‌ఎస్ పార్టీ విజయానికి చేరుతుందన్నారు. కార్యక్రమంలో బాకారం మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి, ఎన్కెపల్లి గ్రామ అధ్యక్షుడు పెండ్యాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దప్పు కరంచంద్, నాయకులు అరవింద్, కుమ్మరి శ్రీనివాస్, ఈదులకంటి రవీందర్, ప్రవీణ్‌రెడ్డి, విగ్నేశ్, నర్సింహ, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తమైసమ్మ దేవాలయంలో శాంతిహోమం



హోమం నిర్వహిస్తున్న పండితులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో రక్తమైసమ్మ దేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా ప్రారంభోత్సవం చేసి 41 రోజులు పూర్తయిన సందర్భంగా శాంతిహోమం, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పూలు, నూతన వస్త్రాలు సమర్పించారు. వివిధ గ్రామాలు, ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అమ్మవారి దర్శనం, తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందించారు. ఈ పూజల్లో ఆలయ పునర్నిర్మాణ దాత కిస్మత్‌పూర్ అర్జున్‌గౌడ్ దంపతులు, మాజీ సర్పంచ్ రవళీగోపి కృష్ణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైనరోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యానారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.